రక్షణ నిబంధనలు

(8 వ పేజీ తరువాయి)

సంఘాన్ని కేంద్రంలోనూ రాష్ట్రాలలో రాష్ట్ర పత్రికా సలహా సంఘాలను నియమించాలని పత్రికా సంపాదకులు చేసిన సూచనను ఆయన అంగీకరించారు. ఎందుకంటే పత్రికా సంపాదకులే భారత రక్షణ నిబంధనలు అనేది అందుకు సంబంధించిన విషయం.

రాష్ట్ర సలహా సంఘాల పని, కేంద్ర సలహాసంఘం పని చర్చితచరణం గాకుండేందుకు వాటి నిధుల విషయంలో కేటాయింపు జరగాలి. పదివేలకు పైగా సర్క్యులేషన్ ఉన్న వార్తాపత్రికల విషయంలో కేసులను కేంద్ర ప్రభుత్వమూ కేంద్ర పత్రికా సలహాసంఘం తిన్నగా విచారించడానికి హోంమంత్రి, పత్రికా సంపాదకులూ కూడా అంగీకరించారు, అలాగే పది వేలలోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికల కేసులను రాష్ట్రప్రభుత్వాలు రాష్ట్ర పత్రికాసలహా సంఘాలు విచారించడానికి అంగీకరించారు.

భారతరక్షణ నిబంధనల్కింద పత్రికపైన ఏదైనా చర్య తీసుకొనే ముందు ప్రభుత్వం పత్రికా సలహా సంఘంతో సంప్రతించాలని నిర్ణయించుకొన్నారు. ప్రాథమిక నేరారోపణ ప్రకారం చర్య తీసుకోదగినదని భావించిన సందర్భాలలో, ఏదైనా నిర్ణయం తీసుకొనే ముందు పత్రికా సంపాదకునికి "మీ మీద ఎందుకు చర్య తీసుకోరాదో తెలియపరచవలసింది" అని నోటీసును ఇవ్వాలి.

పత్రికా సంపాదకుడు సమాధానం ఇచ్చిన తర్వాత ఈ సమాధానం దృష్ట్యా ఏదైనా చర్య తీసుకోవాలా లేదా అనే విషయాన్ని పత్రికా సలహా సంఘంతో సంప్రతించాలి.

కేంద్ర పత్రికా సలహా సంఘాన్ని ఏర్పరచాలన్న నిర్ణయం 1963 ఏప్రిల్‌లో ప్రకటించబడింది. కాని అఖిలభారత పత్రికా సంపాదకుల సంఘంలో ఈ విషయమై ఏర్పడ్డ వేదిక మూలంగా 1963జూలై-ఆగస్టునాటికిగాని ఈ సలహా సంఘం ఏర్పడలేదు. తర్వాత కొద్ది కాలంలోనే అనేక రాష్ట్రాలలో పత్రికా సలహాసంఘాలు ఏర్పడ్డాయి. కాని మద్రాసు, పంజాబ్, బీహార్, కేరళలలో పత్రికా సలహా సంఘాలు ఏర్పడలేదు. అలాంటి సంఘం ఆవశ్యకత తమకు కన్పించడం లేదని కేంద్రానికి పంజాబు ప్రభుత్వం తెలియజేసింది. భారతరక్షణ నిబంధనలు, పత్రికలకు సంబంధించిన వివాదాస్పదమైన కేసులు మద్రాసు బీహారులనుండే వచ్చాయి. అయినా అక్కడ పత్రికా సలహా సంఘాలను ఏర్పరచక పోవడానికి ఏదోవిచిత్రమైన కారణం ఉండి ఉండాలి. రాష్ట్ర పత్రికా సలహాసంఘాలను ఏర్పరచకుండా కేంద్ర ప్రభుత్వపు ఇటీవలి ఉత్తరువులను ముఖ్యమంత్రులు ఎలా అమలు పరచుతారో దురూహ్యంగావుంది. కేంద్రం ఆదేశించినా గతంలో రాష్ట్రాలు ఈ పని ఎందుకు చేయలేదో అది కూడా దురూహ్యంగానే ఉంది.

ఆచరణలో ఇదెలా కొనసాగింది? కేంద్ర పత్రికా సలహా సంఘం అమలులోకి వచ్చిన వెంటనే, దానితో సంప్రతించి "కరెంట్", "పాంచజన్య", "ఆర్గనైజర్" పత్రికలపై చర్య తీసుకోబడింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం "చోఖంబా"పై ప్రాసిక్యూషన్ జరిపింది. "మదర్ ఇండియా" నుండి రు. 5000 సెక్యూరిటీని, "లిబరేటర్‌కంథా" నుండి రు. 3,000 సెక్యూరిటీని డిపాజిట్ చేయవలసిందిగా కోరింది.

కొంతకాలం తర్వాత "బ్లిట్జ్", "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" లను భారత రక్షణ నిబంధనల క్రింద హెచ్చరించారు. (భారత రక్షణ నిబంధనల క్రింద హెచ్చరింపబడిన పత్రికలు ప్రభుత్వ అడ్వర్‌టైజ్‌మెంట్లు అన్నీ కోల్పోయే అవకాశం ఉంది.) చర్యఎందుకు తీసుకోరాదని నోటీసు ఇవ్వకుండానే హెచ్చరిక చేశారని ఈ పత్రికలు వాదించాయి. భారత రక్షణ నిబంధనలక్రింద హెచ్చరిక చేయడమే శిక్ష అని దీని భావం. హెచ్చరికలు ఉపసంహరించుకోబడ్డాయి. తరువాత ఇదివరలో హెచ్చరించబడిన "కరెంట్" తదితర పత్రికలు ఈ సమస్యను తిరిగి లేవనెత్తాయి. చర్య ఎందుకు తీసుకోరాదని తమకుకూడా నోటీసు ఇవ్వలేదని వాదించాయి. అందుచే వీటికి చేసిన హెచ్చరికలు కూడా ఉపసంహరించుకోబడ్డాయి. ఆవిధంగా కేంద్రం ప్రవర్తన కళంకంగాదు.

రాష్ట్రాల విషయం చూస్తే, దానికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. 1965 జనవరి. ఏప్రిలవరులలో భాషా విషయకమైన ఆందోళన సందర్భంలో చెలరేగిన అల్లర్లలో మద్రాసు ప్రభుత్వం కొన్ని తమిళ దినపత్రికలపైన, ఒక తమిళవారపత్రికపైన భారత రక్షణ నిబంధనలక్రింద ప్రాసిక్యూషన్ కేసులు పెట్టింది, దినపత్రికలన్నీ ఎక్కువ సర్క్యులేషన్ ఉన్నవే. పదివేలకు పైగా సర్క్యులేషన్ ఉన్నవే. వీటిపైన చర్యతీసుకోవలసింది కేంద్ర ప్రభుత్వం కాని రాష్ట్ర ప్రభుత్వంకాదు.

ఏప్రిల్ 17వ తేదీన అఖిల భారత పత్రికా సంపాదకుల సంఘం స్టాండింగ్ కమిటీ దానికి తీవ్రంగా నిరసన తెలియచేసింది.

కేంద్ర పత్రికా సలహా సంఘమూ, కేంద్ర ప్రభుత్వమూ సంయుక్తంగా రూపొందించిన విధానాన్ని మద్రాసు ప్రభుత్వం భగ్న పరచిందని స్టాండింగ్ కమిటీ నిరసించింది. అంతకు ముందు కేంద్ర పత్రికా సలహాసంఘం హోంమంత్రి సందానుకలుసుకొని, అందరికీ సుస్పష్టంగా తెలిసిన అవరణ విధానాన్ని మద్రాసు ప్రభుత్వం ఉల్లంఘించినందుకు అసమ్మతి తెలియ చేసింది.

ఈ సమస్యను లోక్ సభలో 1965 ఏప్రిల్ 22 న ప్రశ్నద్వారా లేవనెత్తారు. హోంమంత్రి దానికి వ్రాతపూర్వకంగా సమాధానం చెబుతూ మద్రాసు ప్రభుత్వాన్ని దాదాపు పూర్తిగా సమర్థించారు. అవికారా భాషాసమస్యపై జరిగిన ఆందోళన హింసాస్వభావం కల్గియున్నందున రాష్ట్ర ప్రభుత్వం తీసుపత్రికల విషయంలో సత్వరం చర్య తీసుకోవాలని భావించిందని అన్నారు. మామూలు సమయాల్లో ఐతే ఒప్పందం ప్రకారం అవరణ విధానాన్ని అవలంబించే వారేకాని, అసాధారణ సమయాలలో రాష్ట్ర ప్రభుత్వం త్వరితంగా చర్య తీసుకోవాలని భావించిందని అన్నారు.

కాని రాష్ట్ర ప్రభుత్వ పైఖరి ఏమిటి? 1965 మార్చి 27 న లోక్‌సభలో ఈ సమస్య చర్చకు వచ్చే ఒక నెల ముందు మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ భక్తవత్సలం - భారత రక్షణ నిబంధనల క్రింద ఏదైనా చర్య తీసుకునే ముందు కేంద్ర అత్యవసర పత్రికా సలహా సంఘాన్ని సంప్రతించుకొనని కేంద్ర హోంమంత్రి ఇచ్చిన హామీ తనకేమీ తెలియదని - అన్నారు. "అలాంటి విషయాలలో ఢిల్లీలో ఏం చేస్తారో" తనకుతెలియదన్నారు. ఈ పత్రికల పైన చర్య కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో తీసుకొనలేదనీ, రాష్ట్రప్రభుత్వమే చర్య తీసుకొన్నదనీ ముఖ్యమంత్రి అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మార్చి 27 - ఏప్రిల్ 22 ల మధ్య తన ధోరణిని మార్చుకొన్నదని దీని అర్థం: ఐతే అది చెప్పేవాదన సరియైనదికాదు. "అత్యవసర" పరిస్థితి అనే సాకు క్రింద దాక్కోవాలని అది ప్రయత్నించింది. కాని ఈ వాదన సరియైనదికాదు. ఎందువల్ల నంటే, అభ్యంతర పనబడే విషయాలను ప్రకటించిన రెండు మూడు పారాలకు గాని ఆయా పత్రికలపైన ప్రాసిక్యూషన్ ప్రారంభించలేదు. అందువల్ల, పూర్వపు ఒప్పందాన్ని అమలుపరచడానికి కావలసినంత వ్యవధి ఉంది.

* * *

ఒక సంవత్సరానికి పైగా కోర్టులలో ఉన్న ఈ కేసుల బాగోగుల జోలికిపోకుండా (ఈ కేసులు కొన్నింటిని లేక అన్నింటిని ఉపసంహరించారేమో తెలియదు. ఎందువల్ల నంటే, ముఖ్య మంత్రులు ఇటీవల పత్రికా సంపాదకులను విలిపించారు. ముమ్మందు జాగురూకత వహించుతామని హామీ ఇస్తే ఆ పత్రికలపై కేసులు ఉపసంహరించుకొనే విషయం ఆలోచిస్తామని చెప్పారు.) ఈ పత్రికలపై అపాదించిన నేరాలను పరిశీలిద్దాం, పత్రికా స్వాతంత్ర్యాన్ని అణచడానికి భారత రక్షణ నిబంధనలను రాష్ట్రప్రభుత్వం ఎంత సునాయాసంగా ఉపయోగించుతుందో అనే విషయాన్ని ఈ పరిశీలన తెలియ చేస్తుంది.

"స్వదేశ మిత్రన్" చాలా పాత తమిళ దినపత్రిక. ఆ పత్రిక మితవాద భావాలకు ప్రసిద్ధి చెందింది. తొందరపాటు రాతలు అది వ్రాయదు. కాని ఆ పత్రికపై ఒక ప్రకటనను ప్రచురించినందుకు కేసు పెట్టబడింది. 1965 ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగే ముఖ్యమంత్రుల సమావేశానికి మద్రాసు ముఖ్యమంత్రి హాజరుకాకుండా ఆ ప్రకటన నిరోధించిందనో. లేక నిరోధించవచ్చునో కేసు పెట్టబడింది. పైగా ఈ ప్రకటన ముఖ్యమంత్రి వదుపుకున్నట్టం కల్గించే విధంగా వుందట. ప్రజలలో ఆందోళన, భయమూ కల్గించే విధంగా అతిశయోక్తులతో నిండిన ఆరోపణలతో అప్రకటన నిండివుందట, అభ్యంతరమని భావించబడిన ఈ ప్రకటనను హిందీ వ్యతిరేక సంఘ కార్యదర్శి శ్రీ కె. ఎ. పి. విశ్వనాథన్ తిరుచిలో 1965 జనవరిలో ప్రకటించారు, ఈ ప్రకటనను అచ్చువేసిన పత్రికా ముద్రాపకుడు- ప్రచురణ కర్తలేసహా శ్రీ విశ్వనాథన్ స్వదేశ మిత్రన్‌పై చార్జిషీట్ ప్రకటించబడిన సమయంలో విచారణలో ఉన్నారు. (తర్వాత వీరికి శిక్షవిధింపబడింది.

స్వదేశమిత్రన్ సంపాదకులు, దానిపై ముద్రాపకులు - ప్రచురణ కర్తలపై 41 (5) భారత రక్షణ నిబంధనల క్రింద కేసు పెట్టబడింది.

"మలైమురసు" (మద్రాసు ఎడిషన్)పై కూడా ఇలాంటి నేరమే ఆరోపించబడిందని పత్రికా సంపాదకుని పై ముద్రాపకుడు- ప్రచురణ కర్తపై మూడు అభ్యంతరమైన వార్తలు ప్రచురించారని కేసుపెట్టారు. మొదటిది, చిదంబరంలో పోలీసు కాల్పుల్లో ఒక విద్యార్థి మరణించిన ఉదంతం, రెండవది, తిరునల్వేలి కలెక్టర్ ప్రాణానికి ముప్పుతెచ్చే "బెదరింపు"కు సంబంధించిన వార్త. మూడవది. తిరుపూర్, తిరుచెంగోడ్‌లలో పోలీసుల కాల్పులవల్ల జరిగిన మరణాలను గురించిన వార్తలను ప్రదర్శించిన తీరు.

"మలైమురసు"(కోయంబత్తూరుఎడిషన్) సంపాదకుడు - ముద్రాపకుడు ప్రచురణ కర్తపై చార్జిషీట్‌లో 12 అంశాలున్నాయి. అందులో కార్టూన్లు, ఫోటోలు కూడా ఉన్నాయి.

'మలైమణి' (డి. యం. కె. వారపత్రిక) సంపాదకునిపై పత్రికద్వారా హింసను ప్రేరేపించారని కేసు పెట్టబడింది. రిపబ్లిక్ దినోత్సవాన ఆత్మహననం చేసుకొన్న యువకుని గురించి బొమ్మలు వార్తలు ప్రచురించడం ఆయనపై పెట్టిన చార్జిషీట్‌లోని ఒక అంశం.

అధికారభాషా ఉద్యమ ఆందోళనలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆత్మహననం చేసుకున్న యువకుని, అతని కుటుంబం బొమ్మలు ఆ పత్రికలో ప్రచురింపబడ్డాయి. అందుకు సంబంధించిన వార్తను, బొమ్మను రాష్ట్రంలో అశాంతి ఉన్న ఆ సమయంలో ప్రచురించడం ప్రజలలో ఆందోళన భయమూ కల్గించుతుందనీ, ఆందోళన చేస్తున్న విద్యార్థులను తదితరులను రెచ్చగొడుతుందనీ, అలాంటి హింసాకృత్యాలనూ, ఆత్మ విధ్వంసక కృత్యాలనూ ప్రేరేపించుతుందనీ చార్జిషీట్‌లో ప్రభుత్వం తెలియచేసింది.

"దినతంతి" (మద్రాస్ ఎడిషన్) సంపాదకుడు - ముద్రాపకుడు - ప్రచురణ కర్తను కోయంబత్తూర్‌లో భారత రక్షణ నిబంధనల క్రింద, అతనిపై "అభ్యంతరకర వార్తలు" ప్రచురించారని మద్రాసు పోలీసులు చార్జిషీట్ పెట్టకముందే అరెస్టు చేశారు.

"తమిళనాడ్" (మధురై) పత్రికపై పెట్టిన కేసు వివరాలు లభ్యంకాలేదు.

ఈ కేసులన్నింటిలోనూకూడా "ఎందుకు చర్య తీసుకోరాదో కారణం తెలియచేయాలి" అనే నోటీసులను ఇవ్వలేదు. అలాగే కేంద్ర పత్రికా సలహాసంఘాన్నికూడా సంప్రతించలేదు. ఒక కేసువిషయంలో రాష్ట్ర పత్రికా సలహాసంఘాన్ని సంప్రతించియుండాల్సింది. కాని మద్రాసులో అసలు ఆ సంఘమే ఏర్పడి ఉండలేదు.

మొదట మద్రాసు ప్రభుత్వం పత్రికా సంపాదకుల సలహాసంఘంతో సంప్రతించాలనే విషయం తమకు తెలియదని అంది, తర్వాత తన చర్యను సమర్థించుకొనే ధోరణిని ప్రదర్శించింది.

* * *

స్పష్టంగా రూపొందించబడిన ఆవరణ విధానాన్ని రాష్ట్రాలు అమలు జరుపుతాయా, అనేదికాదు ప్రశ్న. అంతకన్నా ప్రధానమైనది ఏమంటే జాతీయ రక్షణ సమస్యఇమిడి ఉన్నాకూడా పత్రికలపై భారత రక్షణనిబంధనలను ఉపయోగించడం అవసరమా అనేదే. మద్రాసులోని వివాదస్పదమైన కేసులు వీహారు కేసు కూడా జాతీయ రక్షణకు సంబంధంలేని పరిస్థితులలో పెట్టబడినవి. ఐనా భారత రక్షణ నిబంధనలను ఆ కేసుల్లో ఉపయోగించారు. భారత రక్షణ నిబంధనలు, వాస్తవిక వార్తల ప్రచురణను సంకుచిత పరచుతాయి. ఎందువల్లనంటే పొటోలు సైతం "అభ్యంతరకర వార్తలు"గా లెక్కింపబడ్డాయి. ఒక వార్తను ప్రచురించినప్పుడు అది అబద్ధమో సబద్ధమో కూడా ఈ రక్షణ నిబంధనలు విచక్షణగా చూడవు. వాస్తవ వార్తను ప్రచురించినందుకు కూడా భారతరక్షణ నిబంధనల క్రింద శిక్షింపవచ్చు.

ఇటీవల అత్యవసర పరిస్థితిని భారత రక్షణ నిబంధనలను, చట్టాన్ని రద్దు చేయాలని. సంతకాలు చేసిన 34 మందిలో ఏడుగురు ప్రముఖ పత్రికా సంపాదకులున్నారు. పత్రికలకు సంబంధించి సంతవరకు భారత రక్షణ నిబంధనలను రద్దు చేయాలని అఖిల భారత పత్రికా సంపాదకుల సంఘం తీవ్రంగా ఇక ముందు వాదించ గలదని ఆశిస్తున్నాం.



భరతనాట్యం చేస్తున్న వెరా టోవరోవా

సోవియట్ సాంస్కృతిక బృందానికి హైద్రాబాద్‌లో బృందావన్ హోటల్‌లో సన్మానం జరిగినప్పటి దృశ్యం. ఎడమప్రక్క ఆహూతులు, కుడిప్రక్క ముందువరుసలో సాంస్కృతిక బృంద సభ్యులు, శ్రీ తాపీ ధర్మారావు, సినీ నటి కృష్ణకుమారి, బృందావన్ హోటల్ అధిపతి శ్రీ చింతపల్లి అప్పయ్యగార్లున్నారు.

కథానిక :

మా ఊరు కథ

శ్రీ "రామారావ్"

చెరిగిన పిచ్చుక గూడులా, పగిలిన గాజులా, చిక్కుపడిన జుట్టులా వంకర టింకరగా వుంటుంది మా ఊరు.

ఊరుకు వుత్తరాన శివాలయం వుంది. చూచ్చున వెంకటేశ్వరుడున్నాడు.

ఊరుకు మధ్యలో వెంకటప్పయ్య మేడ వుంది. మేడక్రింద వెంకటప్పయ్య అండ్ కంపెనీవుంది. పైన వెంకటప్పయ్య సంపాదనకు అతి మితమైన సంసారంవుంది. ఆ పైన తీరిక వున్నప్పుడు పెన్నెల చూట్టానికీ, చదరంగం ఆడ్డానికీ జాగా వుంది.

మా ఫూల్లో వెంకటప్పయ్యను తెలియని పనివారు లేరు. చందావేయని గుడిలేదు, చేయని, వ్యాపారం లేదు. ఓ యిరువైయేళ్ళ క్రితం, వ్యాపారంలో చేయి తిరగని వెంకటప్పయ్య ఓ మిల్లులో భాగీ గమస్తాగావుండేవాడు. తండ్రి, బండిమీద బజ్జీలుఅమ్మేవాడు.

మిల్లులో కూడికలూ తీసివేతలూ నేర్చుకునే గుమాస్తా వెంకటప్పయ్యకు అంతెలవిలువ తెలియదవుడు. మిల్లులో ముతక బియ్యం లాటి మనిషి, ఊరులో పేరులేని మనిషి, జీతం నూరువైతో యింటెడు దారిద్ర్యాన్ని ఈడుస్తున్న మనిషి.

అప్పటదనికి లాటరీల మీద నమ్మకం లేదు. తను లక్షాధికారి నవుతానని పగటికలకూడా కనలేదు, మిల్లులో గల్లాపెట్టవద్దల కూర్చొని లెక్కలు వేయటం, వీధిని వంచిన తల ఇంటికాడ యెత్తి రెండు ముద్దలు కొరికి నిద్రపోవటం.

అందరి నిద్రా చెదిరేలా. అప్పుడేకాబోలు వచ్చింది. ప్రపంచానికి రెండో యుద్ధం. అయినా మా ఫూల్లో కనీసం తుపాకి పన్నుడు వినపడలేదు. కాకులు కన్ను పొడుచుకున్నా ఓ చచ్చిన శవమైనా కనపడలేదు.

కాని ముగిసిన మరో సంవత్సరానికి ఏమీ లేని జాగాలో యెత్తయిన మేడలు లేచాయి. పెరిగిన ఫ్యాక్టరీల చుట్టూ మురికి వాడలు మొలిచాయి.

అప్పటికి వెంకటప్పయ్యకు గెడ్డాంచుదరలేదు. మీసాలలో యవ్వనం ఇంకా నిండలేదు.

లేచిన మేడలకేసి ఆశ్చర్యంగా తలెత్తి చూశారు, వెంకటప్పయ్య. మరో మిల్లు కట్టిన, తన మిల్లు యజమానిని చూశారు.

కాతా పుస్తకాలలో కనిపించని ఈ లక్షల మర్మంకోసం అప్పుడే తీవ్రంగా తపస్సు చేశారు.

ఆ కలతనిద్రకలలనుండి-సిద్ధి పొందిన ఋషిలా, చిలకలో దాచుకున్న రాతముని ప్రాణాలు చిక్కించుకున్న రాతుమారునిలా, ఓ ఉదయం లేచాడు వెంకటప్పయ్యా.

లేచిన వెంకటప్పయ్య లెక్కల గారడీలో ట్రిక్కులు చిక్కులా విదదీయగలడు.

యుద్ధం వల్ల లాభం అణా పైసలలో, తక్కువ చెప్పగలడు. కొన్ని అణాలూమరి పైసలూ చేర్చి కిరాణం కొట్టు పెట్టాడు వెంకటప్పయ్య. పెట్టి యుద్ధం కోసం ఆశగా యెదురు చూశాడు. మరో యుద్ధం రాలేదు. అయినా అదృష్టం యెదురు తిరగ లేదు.

కానిని బియ్యంలో కానిన రాళ్ళు కలపటం కొబ్బరి నూనెలో నూనె పోయటం;

తక్కువ ధరలో యెక్కువ వడ పోయటం బంగారం లాటి సాంప్రదాయానికి తెలివిని అత్తరులా పూశాడు వెంకటప్పయ్య.

పెరుగుతున్న వ్యాపారంలో, పైసా, పదివేలుగా కూడబెట్టాడు. కూడబెట్టిన లక్ష్మిని నట్టింట్లోపెట్టి తలుపేయలేదు.

జాలిగా ఊళ్ళోకి వడ్డీగా విరజిమ్మాడు.

వడ్డీ మూటలతో కాస్త ధాన్యం, కాస్త కాయ ఇంట్లోనే ఓ—

మూల కొని పోశాడు.

కొని పోసిన ధాన్యాన్ని కడుపు రోజుల్లో అలగా జనానికి తలోగుప్పెడూ బదులిచ్చాడు.

ఆ గుప్పెడూ తిరిగి పుచ్చుకునే సరికి చిన్న గుట్టయింది.

ఈ తృణాలన్నీ కలిపి దొను అవుతున్న పాతనినిమాహాలుకు ఋణంయిచ్చి, వేలుగా కూడ బెట్టాడు.

ఓ పావలా వాటా పుచ్చుకున్నాడు.

ఆ రోజుల్లో వెంకటప్పయ్య ఇంటికి పైన ఖాబు పూర్తవుతుంది. ఖాబుకు సిమెంటు కావాలి.

సిమెంటూ ఇనుమా అమ్మే వరహాలు - వెంకటప్పయ్యతో చిన్న 'పోర్డుని' చూశాడు.

చూపుల త్రాసులో వెంకటప్పయ్యనో వేపూ, కొత్త తరస్సోనటను మరోవేపూ వుంచి తూశాడు. తూకందిగిన వెంకటప్పయ్యలో. అదృష్టంవేపు నుడులు తిరుగుతున్న తెలివిని లెక్కవేశాడు.

చూసి, తూచి తన కూతురికి కాస్తా అతనిలో ముడేయించి, బాంధవ్యానికి గోడౌనులో దాచిన కత్తిలేని సిమెంటు పూశాడు.

ఆ మెట్టెక్కిన వెంకటప్పయ్య కిరాణ కొట్టును కమీషన్ కొట్టుగా మార్చాడు.

సినిమాహాల్లో వాటా పెంచాడు.

చేతిలో సిమెంటు వుందికదా అని చిన్న చిన్న రోడ్లు వేయించసాగాడు.

ఎనిమిదో తరగతి దాటని వెంకటప్పయ్యకు ఎకనామిక్స్‌తెలియదు, అన్యాయంతో అతనికి అణాపాటా కూడా వద్దు,

ఈ లోపు అతను మూడుసార్లు తలనీలిచ్చాడు. తనకు తీరుబడి లేక, తల్లిని బదరీ కేదారానికి స్పెషల్ రైల్లో పంపాడు. ఊరిగుళ్లో మంచినీటిబావిని త్రవ్వించి తండ్రి పేరు చెక్కించాడు.

తపస్సులాటి ఈ పుణ్యానికి రనరూపేణా ఋణం తీర్చుకోక తప్ప లేదు దేవుడికి-

ఇదంతా చూసి గిట్టక కన్నుకుట్టిన టాక్సు వాళ్ళు దాడి చేయడోయారు.

"అమ్మ దొంగా! కాకెత్తుకు పోయింది చూడమన్నాడు" వెంకటప్పయ్యా, "నూకలు జల్లుకాపేకలుకాయ"మన్నాడు, "యేకొట్టుమీద నా పేరు లేదు, యెర్రోడామాసుకో"అన్నాడు.

వాళ్ళు చూస్తూనే వున్నారు. ఏం కన్పించలేదు, కనిపించని డబ్బు, బియ్యం లా గోడౌనులో చేరింది. గిరిగిరి కంపెనీలో వడ్డీ రూపేణా ఊరులోకి ధారగా పారింది. కాసుంపేరుగా జాకెట్టుక్రింద నక్కింది. నిమ్మంటుగా కొట్టుకింద దూరింది.

డబ్బు డబ్బును గీసింది,

కడుపు కడుపును లాగింది.

మేడ కడుపునుంచి, మేడ పుట్టింది.

ఇప్పుడు వెంకటప్పయ్య కోక్షణమైన విశ్రాంతిలేదు. అతను శాంతిప్రియుడు, పావురాయి తెలివులాటి బుద్ధుడు కడ్తాగతను. ఎప్పుడూ కొట్లో బాలీసుపై బాదీపేసుకూర్చొని పోనులోమాత్రం వ్యాపారంచేస్తుంటాడతను.

"లారీలు 'అన్ లోడ్' చేశారా".

"మూడు 'వ్యాగన్లు' బుక్ చేయి".

"బొంబాయి ధర మాకు గిట్టదండీ".

ఇంతకంటే యెక్కువ మాట్లాడడు. వెంకటప్పయ్య,యేసభల్లోకూడా యింతకంటే యెక్కువ మాట్లాడలేదు. ఆయన మాట్లాడే దానికన్నా, అయన్ను గురించి చెప్పే నాలుగు మంచిముక్కలే యెక్కువ వుండేవి యెప్పుడూ.

దేశనాయకుడు యెవరో చచ్చిపోయిన సభలో ఆసలు యేం మాట్లాడలేదు వారు. మైకు ముందునుంచుని కంట తడిమాత్రం పెట్టారు.

"వ్యాపారమే కళ, కళే వ్యాపారం" అన్నారు, ఓసారి ఒక చిన్నతరహా నటుని సన్మాన సభలో.

"వ్యాపార స్వేచ్ఛను అరికట్టటం మానవత్వం మెడకు తాడువేసి ఉరితీయటం" అన్నారు ఓ వాణిజ్యసభలో.

కోవెలలో ఓ సప్తాహంలో-

"ఖర్మకొద్దీ హెచ్చు తగ్గులు, భగవంతుడిచ్చిందే పవిత్ర ప్రసాదం."

ఓ సాహిత్య సభలో-

"స్వేచ్ఛలేనిదే వ్యాపారం రాణించదు. అలాగే సాహిత్యం వికసించదు."

స్కూల్లో తను వేయించిన రేకులషెడ్డు సన్మానంలో,

"బి. ఏ. అయినా బియ్యానికి చాలదు లే దీనాడు, చదువుఅర్థవంతంగా వుండాలి.అర్థం లేనిదే కామం, మోక్షం హరోం హరి" అని దమడక్కరించారు.

ఊరుకు ఉత్తరాన శివాలయం ఉంది. శివాలయం వరండాలో చంద్రయ్యబడి ఉంది. ఆ బల్లోనే వెంకటప్పయ్య ఏడో తరగతి చదివాడు. ఆ బల్లోనే తోడేలు రాములు మనుమరూ, ఏడో తరగతి చదివాడు. తోడేలు రాములు మనుమరు, తోడేలు సోములు. చిన్నప్పుడే తండ్రి చచ్చిన సోములు గాలికే యెదిగాడు. ఆస్పోనినట్టు గ్రామక్కర్థంగా, జట్టుకట్టుకుని గోళీకాయ లాడేవాడు.

ప్రక్కింట్లో దూరి, బెల్లం ముద్ద లెత్తుకు వచ్చి తినేవాడు. ముసలాడి జేబులో అణా కాసు లెత్తుకొచ్చి మూడు ముక్కలాటలు ఆడేవాడు. ఎంగిలి పీకలుమేరి. దమ్ముకొట్టేవాడు. ఏళ్ళు వద మూడు పూర్తికాక మునుపే ముత్తవ్వ మనుమరాల్ని చేయవట్టి కన్ను కొట్టాడు. అందుకే తోడేలు రాములు మనుమణ్ణి బడికి పంపక తప్పలేదు.

అయినా ఎందుకో సోములుకి చదువబ్బలేదు. పుస్తకాల్లో బూతులు దొర్లేవి, అదిగితే డబ్బు లివ్వని తోటివాడి యెముకలు విరిగేవి.

వాణ్ణి వంచి, తనువంగి, అయిదో తరగతి అయిందనిపించి బయటకు పంపించాడు మాస్టారు.

చదువు చాలించి ఊరును పాలించాడు సోములు.గ్యాంగులునుకట్టి గూండాల్లో చేరాడు, దీకటిసందుల్లో సోడాబుడ్డలతోయుద్ధాలుచేశాడు. అప్పిగాడి కోడల్తో ఆరునెల్లు ఆణాతవాసం చేశాడు.

ఇంతలో రెండో యుద్ధం వచ్చింది,

"మిలిట్రీలో యేయి. అక్కడ కాని విరగ్గొట్టి బుద్ధిమరమ్మతు చేయరు," చెప్పాడు తోడేలు రాములుకి.

'మిర్రి' అనగానే, సోమిగాడి తల్లి నూతి దోవదీసింది. ఉన్న ఒక్కణ్ణి చంపేద్దురో, అని గొల్లుమంది.

వీడిని దారినెయ్యటాన్కి మరో మార్గమన్నారు, తులమంతా చేరి.

సోమిగాడు, కాన్స్టేబుల్ సోములయ్యేడు. ఇంకొంత కాలానికికో యింటివాడయ్యాడు. అయిదుగురికి 'నాన్న' నయ్యాడు.

చేతిలో వవరుంది.అయినా బ్రతు కీడ్వటం బరువైంది.

సోమిగాడి పొగడు చదువైంది.

ఊరోపు దేశంలోపాటు మా ఊళ్లో ఖూనీలు పెరిగాయి.

'కె. డీలు, కల్లుముంతలూ, లంజా ఖానాలూ, లఫూట్‌లూ, బ్రాకెట్‌లూ పెరిగాయి.

కాని, కాన్స్టేబుల్ సోములుకి రవ్వంతయినా ప్రమోషన్ రాలేదు.

కాలంలో బరువెక్కిన రోజులను, కాలు జారిన బల్లిలా ఈడుస్తూంటే.....

* * *

అప్పుడు ఆకాశం తెల్లగావుంది.

ఆకాశం గుండెలో చిల్లుపడ్డట్లు, మండుతున్నారు సూర్యుడు మా ఊరిమీద.

అక్కడ

పాకాలంలో కుక్కపిందెలు, బీటలిచ్చిన భూమిపైకి తన్నుకొచ్చినట్లు,

కాంతిలేని నక్షత్రాలు నేలకూలి మనుషులైనట్లు,

వగలగొట్టిన పుట్టనుంచి, బయటపడ్డ త్రాచుల్లా బుసలు కొడ్తున్నారు జనం. వంటిమీద పెట్రోలు పోసుకుని నిప్పెట్టుకున్నాడు సూర్యుడు.

రెక్కలూడిన తూనీగలా నేల కూలాడు. మెడకోసిన కోడిమొండెంలా గిలగిల్లాడాడు. నడుం విరిగిన పాములా మెలికలు తిరిగాడు.

చెదిరి, బెదిరి, పారిపోతున్న జనం కసితీరా తొక్కాడు సోముల్ని-తుపాకీ లాక్కుని ఒళ్ళంతా తూట్లు పొడిచారు.

చెమట తుడుచుకొని సోఫాలో కూలబడ్డాడు వెంకటప్పయ్య.

పటం ముందు వెంకటేశ్వర స్తోత్రం చేస్తుంది మనలమ్మ.

ఏడుస్తూ,అడుస్తూ బూతులు తిడ్తూ రక్తంలో దొర్లుతున్నాడు చచ్చీ బాపని మనుష్యులు.

బెల్లం వాసన పట్టిన చీమల్లా, తుపాకి మోత పనికట్టిన కాకులు ఆకాశం మీనుంచి ఆకలిగా వెతుకుతున్నాయి బలినిన శవాలకోసం. శవాల్లో తమ వాటిని వెతుక్కుంటూ, గొల్లుమంటూ గుండె బాదుకుంటున్నారు జనం.

మిగిలిన తూటాలు మూటగట్టుకుని, రాకెట్ లాటి లారీలో రివ్వున తిరిగెళ్ళారు పోలీసులు.

* * *

అయిదు, ఆరురోజులు—

దేటింగ్ గర్ల్స్ ముందు-పావలా పడుపు కత్తె లాటిది మావూరు. స్పెక్యులేషన్, నేటుముందు, సంతెన కట్టించటానికి కూలబ్బానికి కంట్రాక్టు తీసుకున్న మనిషిముందు, పట్టుబడిపోయే చిన్న జేబుదొంగ లాటిది మా ఊరు. 'మ్యాపులో' సన్న నిరాచుక్క మావూరు, ఇంతకు మునుపెప్పుడూ, మా ఊరి పేరెప్పుడూ, పేపర్లో చివరికాలంలో చిన్న క్షరాలలోతప్ప పడలేదు. ఆ అక్షరాలలో- వెంకటప్పయ్య పేరు లేకుండా లేదు.

ఈ అయిదురోజుల్లో పెద్ద పేపర్లలో చిన్నక్షరాలలోనూ, చిన్న పేపర్లలో పెద్దక్షరాలతోనూ, పదిమందినోట్లో నానింది మావూరు. కొందరు పదిమంది-"అన్నా! జనం బరితెగించారు. చిన్నాపెద్దా లేదు, దోపిడి జనానికి దెబ్బలతో కాని బుద్ధిరాదన్నారు. పేపేగుకున్న అలగా జనాన్ని అణచివేయందే శాంతికి చెరతప్పదన్నారు. మరో పదిమంది-"అయ్యయ్యో! పొట్టకోసం ప్రాకులాడిన పేదాళ్ళ నటయ్యం పేదా? కమిషన్ వేయించండి, కూపీ తీయించండి, అసలు దొంగలనిఆరాతీసి ఉరి తీయండి. అయ్యా! న్యాయం-బట్టోలవక"డన్నాడు.

మరో పదిరోజుల్లో మా వూరిపేరు మాటు మణిగింది.

కమిషన్ రాలేదు. న్యాయం చదువలేదు.

చచ్చినవాళ్ళ వళ్ల మట్టిగా మారింది. బూడిదగాలిలో కొట్టుకుపోయింది.

చావగా మిగిలిన జనం గాసుగుకు కట్టిన పీనుగ యెద్దుల్లా తిరుగుతూనే వున్నారు.

సాహితీస్రవంతి

సీరియల్

కన్నెవలపు

మూలం : ఇవాన్ తుర్గెనీవ్

అనువాదం : నిడమర్తి ఉమారాజేశ్వరరావు

[గతసంచిక తరువాయి]

3

మరునాటి ఉదయం నిద్రలేచికూడా బద్ధకంగా పడుకుని వున్నాను. ఇంతలోనే చేతి కర్రతో తలుపుమీద టకటక కొట్టిన శబ్దం వినవచ్చింది.

"మేలుకొనుమో ప్రియసఖా
మేలుకొనవోయీ
వీనుల విందుగ వీణానాదం
విన్పింతునిదె వినరావోయీ"

అంటూ పాటకూడా వినవచ్చింది. గాగిన్ స్వరాన్ని గుర్తించి, వెంటనే తలుపుతెరిచాను.

లోపలికి వస్తూ అతను "ఉదయాభివందనం" అన్నాడు. "నీ నిద్రకు భంగంకలిగించినట్టున్నానే. అయితేనేం లే. ఉదయం యెంత శోభాయమానంగా వుందోచూడు! ప్రత్యూషవవనవీచిలు, ముత్యాలవంటి మంచు బిందువులు, వకుళ కలకలారవాలు ఓహ్!..."

మిలమిల మెరిసే గిరజాల జుట్టు, అనాబ్భారితమైన బలమైన మెడ, గులాబిరంగు బుగ్గలతో అతనే వున్నాడు సుందర, సురుచిర సుప్రభాతంలా.

నేను దుస్తులు ధరించాను. తర్వాత యిద్దరం తోటలోని బల్లమీద కూర్చుని కాఫీ తెప్పించుకు త్రాగుతూ మాట్లాడుకోసాగాం. గాగిన్ తన భవిష్యజీవితపు ప్లానులు చెప్పసాగాడు. తనకు చాలినంత ఆస్తీ, ఆదాయం వున్నాయట. తాను సర్వస్వతంత్రుడట, చిత్రకళకు తనజీవితాన్ని అంకితంచెయ్యాలని నిర్ణయించుకున్నాడుట. అయితే, యీ నిర్ణయానికి వచ్చేసరికి చాలాకాలం వృధాగా గడిచిపోయిందన్న దొక్కటే అతనిచింత అని కూడా చెప్పాడు. నేనూ నా ప్లానుల విషయం అతనికి మనసు విప్పి చెప్పాను. నా భగ్న ప్రేమ రహస్యం కూడా వదిలిపెట్టకుండా అతనికి చెప్పాను, అయితే నా ప్రేమవృత్తాంతం అతనిలో యేమంత యెక్కువ అనుకంపాన్ని కలిగించినట్టు కనిపించలేదు నాకు. బాగుందన్నట్టుగా నాతోబాటు ఒకటి రెండు నిట్టూర్పులు విడిచి, తన యింటికి వచ్చి తన చిత్రాలను చూడవలసిందిగా నన్నాహ్వానించాడు. నేను వెంటనే అంగీకరించాను.

మేము చెళ్ళేసరికి ఆస్యా యింటివద్ద లేదు. ఆమె శిథిలభవనాలు చూడటానికి వెళ్ళిందని యింటి యజమానురాలు చెప్పింది. ఒ-పట్నం సమీపంలో శిథిలమైపోయిన కొన్ని రాజభవనాలున్నాయి. గాగిన్ తన చిత్రాలను నా ముందు పరిచాడు. అతని చిత్రాల్లో కొంతలేవం. స్వేచ్ఛాభావం, నైపుణ్యం వున్నాయి. అయితే ఏ ఒక్కటీ పూర్తికాలేదు. పైగా చిత్రరచనకూడా నిర్లక్ష్యంగా, నీరసంగా వున్నట్టు తోచింది నాకు. నా అభిప్రాయాన్ని స్పష్టంగా అతనికి చెప్పాను.

"ఔనాను!" అన్నాడతను నిట్టూరుస్తూ "నువ్వు చెప్పింది నిజమే, ఇవన్నీ చాలా కచ్చాగా, గజిబిజిగా వున్నాయి. అయితే, నన్నేం చెయ్యమంటావు చెప్పు? నే నెన్నడూ యెవరి దగ్గరా శుశ్రూషచేసిన పాపాన పోలేదు. పైగా నీకు తెలిసిందేగా మనకాతికి నెన్నలో వెట్టిన విద్య - తగని బద్ధకం ఒకటి. ఆలోచన దశలోవున్నంతవరకు మన సంకల్పాలు బ్రహ్మాండంగా, ప్రపంచాన్ని తలక్రిందులు చేసేవిగా కనిపిస్తాయి. తీరా ఆచరణలోకి వచ్చేసరికి అవి చప్పగా నీళ్ళు కారి పోతాయి."

నా ప్రాణం చిప్పుక్కుమంది. ఉత్సాహం కలిగిద్దామని యేదో చెప్పబోయాను. అంతలోనే గాగిన్ అడ్డు వచ్చి, చిత్రాలన్నీ ప్రోగుచేసి సోఫామీదకు విసిరేశాడు.

"శ్రమపడి నేను కృషిచేస్తే యేమన్నా మంచి చిత్రాలు సృష్టించ గలుగుతాను. లేదో, బద్ధుర్ధాయి నమోన్నమఃలాగ యిలాగే వుంటాను. పోయి ఆస్యాను వెతుకుదాం, లే" అన్నాడు గాగిన్.

మేము బయల్దేరాం.

4

శిథిల రాజభవనాలకుపోయేదారి యిరుకైన ఒకలోయ అంచుమీదుగా వుంది. ఈలోయ అడుగుభాగంలో కొండంపైనుండి జాలువారే సెలయేళ్ళన్నీ యేకమై అడ్డటినుండి వేగంగా ప్రవహించి రైన్ మహానదిలో కలుస్తాయి. ప్రకృతి కాంత అందాలు క్రుమ్మరించిన తావులను గాగిన్ వ్రేలెత్తి నాకు చూపుతున్నాడు. గాగిన్ గొప్ప చిత్రకారుడు కాలేకపోయినా, అతనికి కళాకారుని అర్థగ్రాహ్యదయం మాత్రం వుంది. కొద్ది దూరంలోనే భవనాలు కనిపించాయి. ఒక శిలాశిఖరంమీద చతుర ప్రాకారంలో వున్న పెద్ద బురుజొకటి కానవచ్చింది. కాలచక్ర ప్రవాహంలో ఎండవానల తాకిడికి రట్టుకుని నలుపు తిరిగి యింకా బలంగానే వున్నా ఆ బురుజు మధ్యకు చీలివుంది. దాని కిరువంకలా పాకుడు పట్టిన గోడలున్నాయి. బురుజుపైన అర్చీలమీద బీటల్లో మొలిచిన పిచ్చిమొక్కలు గుబురుగా క్రిందకు వ్రేలాడుతున్నాయి. బురుజునుండి సింహద్వారం వరకూ రాతిబాట వుంది. సింహద్వారం చెక్కు చెదరకుండా పదిలంగా వుంది, మేము సింహద్వారంలో అడుగుపెట్టేసరికి బురుజు చివర బీట దగ్గరగా ప్రాకుతూ ఒక స్త్రీ మూర్తి కనిపించింది.

"అదుగో ఆస్యా, వరి పెంకిపిల్ల!" అంటూ విస్తుపోయాడు గాగిన్.

సింహద్వారం దాటి, ఘుళ్ళచెట్లతో నిండిన ఆవరణలో ప్రవేశించి చూస్తుంటే కదా పిట్టగోడమీద వున్నది నిజంగా ఆస్యాయే. ముఖం మా వంకత్రిప్పి ఆమె నవ్వింది. అయితే తనువున్న చోటునుండి కదల్లేదు. గాగిన్ ఆమెవంక తన్నినూపాడు. ఆమె అజాగ్రత్తపనాను నే నామెను గట్టిగా హెచ్చరించాను.

"దాని విషయం పట్టించుకోకు!" అంటూ గాగిన్ నాతో మెల్లగా అన్నాడు. "దాన్ని యెగతాళి చెయ్యకు. నీకింకా దాని సంగతి పూర్తిగా తెలియదు. ఈ పిట్టగోడ కాదు. చిటారు శిఖరం మీదకి కూడా ఎక్కగలదు. ఇక్కడి సామాన్య ప్రజల తెలివితేటలు చూశావా, యెంత అద్భుతంగా వన్నెచిన్నెలు దాల్చాయో!"

నేను చుట్టూ కలియచూశాను. ఒక మూలగా చిన్న పెట్టిఅంగడిలో కూర్చొని ఒక ముసలమ్మ మేజోళ్ళు అల్లుతూ తన సుర్మాలోనుంచి మమ్మల్ని దీక్షగా చూసింది. ఆవిడ అక్కడకు వచ్చే యాత్రికులకు బీరు, రొట్టె, ఖనిజోదకం అమ్ముతోంది. మేము బల్లమీద కూర్చుని పెద్దపెద్దగ్లాసులతో చల్లని బీరు త్రాగసాగాము. ఆస్యా మాత్రం మొదటి చోటనే కాళ్ళు మెలేసుకుని కదలకుండా కూర్చుంది. తల కొక మఫ్లరు కట్టుకుంది. నిర్మలంగావున్న ఆకాశం యెదుట ఆమె ఆకారం చాలా సొగసుగా కానవస్తోంది. అయితే నాకు మాత్రం ఆమె అంటే అయిష్టంగానే వుంది. అంతక్రితం రోజుననే ఆమెలో అసహజమైనదీ, నిగూఢమైనదీ యేదో వుందని కనిపెట్టాను ... "ఎదుటివాళ్ళ మనస్సుల మీద చెరగని ముద్ర వెయ్యాలని ఆమె ప్రయత్నంలా వుంది. పాపం, ఆపని ఆమె యెందుకు చేస్తుందో, అయినా యెంత చిలిపి చేష్ట!" అనుకున్నాను. నాభావాలు గ్రహించిందేమో అన్నట్టుగా ఆమె నావంక తిరిగి, పరీక్ష చేస్తున్నట్టు తీవ్రంగా నావంకచూసి. మందహాసం చేసి. రెండు అంగల్లో పిట్టగోడ నుండి క్రింద కురికి ముసలమ్మ దగ్గరకువెళ్ళి ఒక గ్లాసుకు మంచినీళ్ళడిగి తీసుకుంది.

తన అన్నవంక తిరిగి "నాకు దాహం వేసి నీళ్ళడిగా ననుకున్నావా? అబ్బే. ఆ గోడమీద కొన్ని చిత్రమైన పూలమొక్కలున్నాయి. వాటికి నీళ్ళు పొయ్యాలని అడిగానంతే" అంది.

గాగిన్ ఆమె మాటలు వినిపించుకోలేదు. చేతిలో గ్లాసు పట్టుకుని ఆమె మళ్ళీ గోడపై కెక్కనారంభించింది. మధ్య మధ్య ఆగుతూ పెద్ద వస్తాదులా బోజులు పెడుతూ పైకెక్కుతూంటే గ్లాసులోనుండి మధ్యమధ్య కానిని నీళ్ళచుక్కలు ఒలికి యెండలో మిలమిల మెరిసిపోతున్నాయి. తేలికగా, సునాయాసంగా ఆమె ఆరోహిస్తుంటే. ఆమె ఒడలి కదలికలు అందంగా, ఆకర్షణీయంగా వున్నాయి. నాకుమాత్రం గాభరా కలిగింది. ప్రమాదకరమైన ఒకచోట ఆమె పడబోతున్నట్టు నటించి గట్టిగా అరిచి అంతలోనే పక పకా నవ్వసాగింది....నాకు మరింత గాభరా కలిగింది.

ముసలిది పైకిచూసి "కొంత గొర్రెకన్న బాగా ఎక్కుతోందే!" అని విస్తుపోయింది.

చివరకు ఆస్యా పూలమొక్కలకు నీళ్లు పోసి, తమాషాగా ఊగుతూ క్రిందకు దిగి వచ్చింది, ఆమె కనుబొమలు, ముక్కుపుటాలు, పెదవులు విలక్షణంగా, హేళనగా మెలికలు తిరిగాయి. ఆమె నల్లని కండ్లు సగం తమాషాగా, సగం నిర్లక్ష్యంగా అర మోడ్చుకున్నాయి.

"నా ప్రవర్తన బాగాలేదని మీరనుకుంటున్నారు. ఆ సంగతి నాకు తెలుసు. కాని నాకేం లెక్కలేదు. నీఖానికి మీరు నన్ను మనసామెచ్చుకుంటున్నారన్న సంగతి నాకు తెలుసు" అంటున్నట్టున్నాయి ఆమె కళ్లు.

"బలే, ఆస్యా. అద్భుతం!" నెమ్మదిగా అన్నాడు గాగిన్.

ఆమె అంతలోనే సిగ్గుపడిపోయినట్టు కనిపించింది. తప్పుచేసిన దానిలా తన కనురెప్పలను వార్చి, మాప్రక్క వినయంగా కూర్చుంది. ఆమె ముఖంవంక పరీక్షగా చూడటం నాకు అదే మొదటిసారి. అంతత్వరత్వరగా కవళికలు మారే ముఖాన్ని నే నెన్నడూ చూడలేదు. మరికొన్ని క్షణాల్లో ఆమె ముఖం పాలిపోయి అనాసక్తంగా, పరధ్యానంగా, విచారంగా మారిపోయింది. అంతలోనే నీరవనిశ్శబ్దతలో నిమగ్నమైనట్టు కనిపించింది. మేము నలుపంకలాతిరిగి శిథిలాలన్నింటిని శ్రద్ధగా తిలకించాము. ఆస్యా మావెంటనే వచ్చింది. భోజన సమయమైంది. గాగిన్ ముసలిదానికి సొమ్ము చెల్లించి, మరొక బీరు సీసా తీసుకుని, నావంక కొంటెగాచూస్తూ "నీ హృదయేశ్వరి ఆరోగ్యార్థం!" అన్నాడు.

"ఆయనకి—అదే మీకు హృదయేశ్వరి నిజంగానే వుందా?" ఆస్యా అకస్మాత్తుగా ప్రశ్నించింది.

"లేని దెవరికి!" గాగిన్ కొనిరాడు.

ఆస్యా ఒక క్షణకాలం ఆలోచనలో మునిగిపోయింది. అంతలోనే ఆమె ముఖకవళికలు మారి, తిరిగి వెనుకటి పెంకె, పెడసరపు హావభావాలు సాక్షాత్కరించాయి.

తిరుగు ప్రయాణంలో ఆమె నవ్వులకు, త్రుళ్ళింపులకు పట్టుపగ్గాలు లేకపోయాయి. ఒక పెద్దకొమ్మను ఎరివి, యుద్ధవీరునిలాగ తన ఫిరంగిమీద వేసుకొని, లెఫ్ట్, రైట్ అంటూ కవాతు ప్రారంభించింది. త్రోపలో మాకొక సాంప్రదాయ సిద్ధమైన ఆంగ్లేయ కుటుంబం ఎదురు వచ్చినట్లు జ్ఞాపకం. ఆ కుటుంబంలోని వారంతా ఆస్యావంక విస్తుపోయి, గుర్రప్పగించి చూడ నారంభించారు. ఆస్యా వాళ్ళని మరింత ఏడ్పించ దానికి అప్పటికి రాలేదు. నేనింటికి పోవలసిన వేళయింది.

ఎంత "పెంకెపిల్ల!" గాగిన్ ఆశ్చర్యపోయాడు. "నిన్ను సాగినంపనా? బోవలోనే లూయీసతి యింటివద్ద ఆస్యా వుందేమో కూడా చూచవచ్చు"

మేము క్రిందకు దిగి. ఒక యిరుకు సందుగుండా పోయి, ఒక నాలుగంతస్థుల యింటివద్ద ఆగాం. రెండు, మూడు, నాల్గవ అంతస్థులు మొదటిదాని కన్న ముందుకు పొడుచుకు వచ్చాయి. శిథిలమవుతున్న రాతి కట్టడం, పై అంతస్తుల భారాన్ని వహిస్తున్న రెండు లావుపాటి స్తంభాలు కోనైన పెంపటి కప్పు, పక్షిదుక్కిల్లా ముందుకు బొరుచుకు వచ్చిన పోర్టికో - యివన్నీ కలిసి ఒక పెద్ద పక్షి ఆకారంలా వుందా భవనం.

"ఆస్యా! ఓ ఆస్యా!" అని అరిచాడు. గాగిన్.

మూడవ అంతస్థులోని ఒకగది కిటికీ తెరిచి ఆస్యా తొంగిచూసింది. ఆమె వెనుకనే ఒక బోసినోటి జర్మను ముసలమ్మకూడా వంగిచూసింది.

కిటికీకి వయ్యారంగా ఆనుకుని. ఆస్యా "యిక్కడున్నాను!" అంటూ కేకేసింది. "నాకు యిక్కడ చాలా హాయిగా వుంది. ఇదిగో దీన్ని పట్టుకో!" అంటూ ఒక పువ్వు గుచ్చాన్ని గాగిన్ మీదకు విసిరింది. "నేనే నీహృదయేశ్వరి ననుకో."

లూయీసతి పకపక నవ్వింది.

"న-గారు వెళ్ళిపోతున్నారు. నీ దగ్గర సెలవు తీసుకోవాలని వచ్చాడాయన" అన్నాడు గాగిన్.

"నిజం? అట్లా అయితే ఆ గుత్తిని ఆయనకియ్యి,ఇదుగో యిప్పుడేవస్తున్నాను," అంది ఆస్యా.

ఆమె కిటికీ కలువ దభాలున మూసింది. నిస్సందేహంగా లూయీ సతిని ముద్దుపెట్టుకునే వుంటుంది. గాగిన్ పువ్వుగుచ్చాన్ని మెల్లగా నాకు అందించాడు. నేను నిశ్శబ్దంగా దాన్నందుకుని నా జేబులో పెట్టుకుని, నది ఒడ్డుపవెళ్ళి, నావమీద నదినిదాటి, అవతలి ఒడ్డు చేరుకున్నాను.

నేను యింటికి పరధ్యానంగా నడవ నారంభించాను. హృదయం భారంగావుంది. అంతలో అకస్మాత్తుగా జర్మనీలో అపూర్వం రష్యాలో అతి సామాన్యమూ అయిన ఒకానొక సువాసన నా ముసుపువూలకు సోకింది రోడ్డుపక్కనే విరగపూసిన ఒక చిన్న జనపచేను కనిపించింది. ఆ పరిమళం ఒక్క మారుగా నా మాతృదేశాన్ని గుర్తుకుతెచ్చియింటిపై బెంగ కలిగించింది. ఒక్కమారుగా మా రష్యాకు వెళ్ళిపోవాలనీ, రష్యనుగాలి పీల్చాలనీ. రష్యనుభూమిపై నడయాడాలనీ గాఢమైనకోర్కె జనించింది. "నేనిక్కడ ఏం చేస్తున్నట్లు? ఇక్కడ. ఈ విదేశంలో, విదేశీయుల నడుమ ఎందుకిలా బలదూరులా తిరుగుతున్నాను?" అని విస్తుపోయాను. నాహృదయాన్ని దిగదీస్తున్నభారం మంటగా, గాఢంగా చెలరేగింది. అంతకు ముందురోజులా కాక ఆ రోజున నేను అదొక విధమైన కోపంతో యింటికి చేరుకున్నాను. ఆ కోపం నన్ను చాలసేపటివరకు వదల్లేదు, ఆ కోపానికి విసుగుదల కూడా తోడయింది. చివరికి నా పూర్వప్రియురాలిని స్మృతి పథంలోనికి తెచ్చుకోటానికి ప్రయత్నించి, ఆమె రాసిన జాబుల లోంచి ఒక దాన్ని బయటకు తీశాను. నేను దాన్నింకా తెరవకముందే నా ఆలోచనపరంపర మరొక వంకకు మరలింది. ఆస్యాను గురించి ఆలోచించడంమొదలు పెట్టాను. గాగిన్ తన మాటల సందర్భంలో రష్యాకు తిరిగి వెళ్ళటానికి తనకేదో అభ్యంతరం వుందని అన్నట్టు నా మనస్సుకి స్ఫురించింది. "అయితే యింతకీ, ఆస్యా, నిజంగా గాగిన్ చెల్లెలేనా అని?" బిగ్గరగా నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

దుస్తులు మార్చుకుని నిద్రించ ప్రయత్నించాను. ఒకగంట పోయాక పక్కమీద లేచి కూర్చుని, తలగడపై మోచేతులను గుచ్చి "ఆ వింత నవ్వుల విలక్షణ బాలికను గురించి" తలపోయసాగాను. "ఆమె ఆకారం అపూర్వ శిల్పఖండంలా వుంది. ఆమె ఎన్నటికీ అతని చెల్లెలై వుండదు....." అనుకున్నాను.

నా పూర్వ ప్రియురాలి పుత్తరం వెన్నెల్లో నేలమీద పారాడుతోంది.

5

మరుసటిరోజు ఉదయం మళ్ళీ "ల-" పట్నానికి వెళ్ళాను. గాగిన్‌ని చూడటానికే వెళ్తున్నానని ఎంతగా సరిపెట్టుకో జూచినా నిజానికి ఆస్యాను చూడాలనీ, క్రితం రోజులాగే యీ రోజునకూడా తమాషా వేషాలు వేస్తుందో, లేక ఎలా ప్రవర్తిస్తుందో చూడాలనీ చాలా తపనగా వుంది, అంతరాంతరాల్లో. నే వెళ్ళేసరికి వాళ్ళిద్దరూ ముందరిగదిలో కూర్చునివున్నారు. చిత్రం ఏమిటంటే-రాత్రంతానూ, ఉదయం పూటా రష్యానుగురించే తలపోస్తున్నానేమో ఆస్యా అక్కరాల రష్యను యువతిలా, సర్వసామాన్యయువతిలా,సంసారిలాకనిపించింది. పాత గౌనొకటి తొడిగి, జుట్టు ఎగదువ్వి, కిటికీదగ్గర కూర్చుని. ఎన్నడూ ఏమీ యెరుగని ముత్తయిదులా ఎంబ్రాయిడరీ కుడుతోంది! అప్పటి ఆమె ప్రశాంతవదనం చూస్తూంటే ఆమె ఎన్నడూ మరేపనీచెయ్యనే లేదేమో అనిపిస్తుంది. ఆమె మాటమంతీ లేకుండా, తదేకధ్యానంగా కుట్టుకుంటోంది. ఆమె ముఖకవళికలు పట్టెటూరి పడతుల్ని తలపింపచేస్తున్నాయి. ఆ పోలికను పూర్తిచేసేందుకు కన్నట్టు "ఓ మాతా, ప్రియమాతా!" అంటూ కూనిరాగాలు తీయడం ఆరంభించింది, ఆమెఅప్పటిఉత్సాహరహితమైన ముఖాన్ని చూసినకొద్దీ గతదినం నామనో వీధిలో మెలగిన స్వప్నాలు గుర్తుకు వచ్చి. ఎందుకో తెలియకుండా మనస్సు నీరైపోయింది. బయట ప్రకృతి మనోజ్ఞంగా వుంది. గాగిన్ చిత్రాలు గీసుకునేందుకు వెళ్తున్నానని చెప్పాడు. అతని వనికి నేను అటంకం కానకుండా నేనుకూడా వస్తానని చెప్పాను.

"అద్దుకాదు సరికదా. నువ్వు నాకు సలహాయిచ్చి సహాయంకూడా చెయ్యవచ్చు" అన్నాడు గాగిన్.

గాగిన్ ఎత్తైన టోపీ ధరించి, డ్రాయింగు సామగ్రివంకక్రింద పెట్టుకొని బయల్దేరాడు. అతని వెన్నెంటనే నేనూ బయల్దేరాను. ఆస్యా

(మిగతా రేపటిలో)

ఓ గాంధి!

— శ్రీ కాళోజి నారాయణరావు

ఇంకేమి కావాలె?
ఇంకేమి చేయాలె?
బ్రతికినన్నాళ్ళు నిను
బాపు అని పిలిచితిమి
చచ్చిపోయిన నిన్ను
జాతిపిత జేసితిమి ॥ఇంకేమి॥

పెక్కుభంగుల నిన్ను
చెక్కి నిలపేసితిమి
పేర్కుతో నింటింట
వ్రేలాడ దీసితిమి ॥ఇంకేమి॥

నీ పేరుతో టోపి
నిత్యమైపోయినది
నీ సూత్రభాష్యమే
నిలువెల్ల దాచినది ॥ఇంకేమి॥

నీమాట మాటుననే
మాయాట పలికితిమి
నీ అడుగులను జూపి
మా అడుగు వేసితిమి ॥ఇంకేమి॥

నీచేతి సూత్రాలు
మాచేతి మగ్గాలు
కాలానుగుణ్య దు
కూలముల ధరనెరిగి
అనుకూలమగు నేత
లననేసి వెలసినది ॥ఇంకేమి॥

ఏనాడో నిను మేము
'ఏసు'గా జేసితిమి
ఎవనిచేతనొ నీవు
'ఏస'గుట చూచితిమి ॥ఇంకేమి॥

నీ నీడగా మెలిగి
నిండార వెలిగితిమి
కాళోజి మాటలకు
కడుపుబ్బ నవ్వితిమి ॥ఇంకేమి॥

సద్దు మణగింది

—శ్రీ పోతుకూచి సాంబశివరావు

ఇన్ని దినములు నేను
ఏమేమొ తలచాను
కన్న కలలకు నేను
దూరమై పోయాను.
ఏ హృదిని తాకి
ఏమదిని పిలిచి
హృదిలోని మదిలోని
సద్దు విన్నానో
ఆ సద్దు మణగింది;
ఆ సద్దు మణగింది ॥ఇ॥

ఎదురుగా సెలయేరు పారింది
ఏటి ఒడ్డున వెలిగె దీపమ్ము
దీపమును విడిచి దీప్తి నీడల కలసి
సెలయేరు గల గలా పారింది
సెలయేరు గల గలా పారింది ॥ఇ॥

ఆకసమున చందమామ
అంతటా చల్లని వెన్నెల
వెన్నె లొసగిన సూర్యుడేదీ?
కన్నెమనసుకు కట్టు ఏదీ? ॥ఇ॥

పయనించ, పయనించ,
బాట కంతములేదు
చింతించ చింతించ
చిత్త శాంతియులేదు ॥ఇ॥

కాపలా

— వెల్లటూరి పూర్ణానంద శర్మ

గ్రంథసమీక్ష

మధువలయము

(తెలంగాణా స్వాతంత్ర్య సమరగాథ)
రచయిత : శ్రీ ఎజ్జోజు మాధవాచార్యులు.
వెల : రూపాయిన్నర

ప్రతులకు : అప్పరాయ గ్రంథమాల, సూర్యపేట, కృష్ణాజిల్లా.

"మహామనత వహించిన నైజాముర్రాజ్యం యొక్క లయము" అంటే భారతదేశంలో నైజాం సంలీనం కావడం ఈ పద్యకావ్యంలోని ఇతివృత్తం. ఇద్దరు సోదరుల ఆత్మబలిదానాన్ని తెలిపే మఖ (యజ్ఞ) వలయం అని కూడా ఈ శీర్షికస్ఫురింప చేస్తుంది.

ప్రజ్వలనము, ఆహుతి, ఫలోదయము అని మూడు భాగాలుగా ఈ కావ్యం విభజింపబడింది. ఇందులోని రెండవ ఆశ్వాసం హృదయాన్ని చలింప జేసే కరుణామయ సన్నివేశాన్ని చిత్రించుతుంది. ఇంట్లో ఏడో తగువులాడి తల్లినీ, పెళ్ళాం బిడ్డల్ని విడిచిపెట్టిపోయిన ఒక యువకుడు పొట్ట కూటికోసం పాదుషా సైన్యంలో చేరి రజాకార్లతో గ్రామాలపైదండెత్తుతూఉంటాడు. భారత సేనలు రజాకార్లను తుదముట్టించడానికి "పోలీసు చర్య" సాగించిన రోజుల్లో రజాకార్లను ఎదిరించుతున్న అన్నకు జారస సరకారు. ఒకరినొకరని గుర్తించుకొని దుఃఖించుతుంటారు. ఆసమయంలో వెనక నుండివచ్చిన సైనికాధిపతి ఏదోఅనుమానం తగిలింది. అపుడు ఆ గడబిడలో వరస్పరం కాల్చుకొన్నందువల్లో, అన్న తుపాకిగుండు తమ్ముని తుంపిందో, సైనికాధిపతి పిస్తోలు దెబ్బకు అన్న చనిపోయాడో "యెన్నిక సేయగాడు కడకీ కథ పర్యవసించె నీగతిన్".

మాధవాచార్యులుగారి పద్యరచన సాఫీగా నడుస్తుంది. ఆయా సందర్భాలకు అనుగుణమైన ధోరణులలో పాత్రల సంభాషణలను నడిపి పాఠకులను రంజింపచేశారు. ముఖ్యంగా మూడవ ప్రకరణంలో ఇది స్పష్టంగా కన్పించుతుంది.

ఈ కావ్యంలో అన్నదమ్ముల ఆహుతి, కరుణ రసాన్ని ద్రవింప చేయగా, తుది అధ్యాయంలో నైజాం నవాబు లొంగిపోయిన ఘట్టాలలో నున్నితమైన హాస్యం గిలిగింతలు పెడుతుంది.

"మ. ఘ. వ. నైజాం ప్రభువు"రాజ్యంలో ప్రజలను నానా యమయాతనలకు గురిచేసిన రజాకార్ల దురంతాలను ప్రజలెన్నడూ మరచిపోరు, కాని అదేసమయంలో వీరిని ప్రోత్సహించిన హిందూజాగీర్దార్లు! పటేల్ పట్వారీలు స్థానిక భూస్వాములూ ఎంతో మంది ఉన్నారు. వారివిషయంకూడా ఇందులోప్రస్తావించిఉంటేబాగుండేది.రజాకార్లరాక్షసకృత్యాలను వల్లించేటప్పుడుదొర్లిన "మ్లేచ్ఛ" ఇత్యాది పదాలు ముస్లిం ప్రజలు అపార్థం చేసుకోకుండా ఉండేందుకు అపుడు మాత్రమే సాధ్యమౌతుంది. మనం ద్వేషించేది ముస్లిం మతోన్మాదాన్ని, ఫ్యూడల్ నిరంకుశత్వాన్నే. ఈ విషయంలో అచార్యులుగారు ఇంకా కొంత శ్రద్ధవహించితే బాగుండేది.

సమకాలీన చరిత్రలోని ఒక చిన్న సంఘటనతో స్పందితులై ఇలాంటి కావ్యరచనకు పూనుకున్న రచయితను అభినందిస్తున్నాం.

— తుమ్మల

స్వీకారం

కవిత

(సాహిత్య మాస పత్రిక)
ఎడిటర్ : శ్రీ ఎ. విజయభాస్కరరెడ్డి,
సబ్ ఎడిటర్ : శ్రీ ఎం. వి. రమణారెడ్డి,
ప్రతులకు : కవిత
విడి ప్రతి వెల : 60 నయాపైసలు
బ్రాడీపేట, గుంటూరు - 2.

జ్యోతిర్మయి

(మహబూబ్‌నగరమండల కవుల కవితా సంకలనం)
వెల : రెండు రూపాయలు
సాహిత్య సాంస్కృతిక సమితి,
వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా.

ఒక నాటి రాత్రి

రచయిత : డియార్
వెల : రు 5-00
ప్రతులకు
శ్రీ వెంకటేశ్వర గ్రంథమండలి, హనుమాన్‌పేట, విజయవాడ-3.

నీలి తెరలు

రచయిత : శ్రీ దేవినేని శ్రీరామ మోహనరావు
వెల రు. 1-50
ప్రతులకు : మంజుల పబ్లికేషన్స్, ఏలూరు.

మా ఊరు కథ

(4 వ పేజీ తరువాయి)

ఊరు. ఊరుకు ఉత్తరాన శివాలయం వుంది. ఆలయానికి వెనుక కావలసినంత స్మశానం వుంది.

ఊరుకు మధ్యలో ఇప్పుడు, వెంకటప్పయ్య పార్కుకూడా వుంది.

తూర్పున 'వెంకటేశ్వరు డున్నాడు.'

వెనుకెపుడో నరసింగ భూపతిగారి-సుబేదారుగారి, జమీందారు యేలారు మా వూరిని.

బాలా-కాలం-కాలం తర్వాత.

వెలమ జమీందారుగారి జమీలో జమ అయింది మా వూరు.

చరిత్ర కథలో చిన్నక్షరం మావూరు.

ఆ అక్షరానికి నిండుగా ఇప్పుడు వెంకటప్పయ్య ఉన్నాడు. కామా సెమికోలన్లలా, తూటాలూ, లాఠీలు బొమ్మలున్నాయి. గొడ్లు నడిచే బాటపై, పచ్చగడ్డి ఏరలల్లా ఎప్పుడూ వున్నారు జనం.

గరం మత్తులో. వీకటిలాటి వర్తమానంలో జోగుకూ నిద్రోతుంది మా వూరు

నిముక్తి ఉదయించే వరకూ - ఉదయం వికసించే సూర్యుని కొరకూ-

కామేపల్లిలో అగ్నిప్రమాదం

ఒక వృద్ధస్త్రీ, రెండు పశువుల మరణం

ఒంగోలు, మార్చి 10

ఒంగోలు తాలూకా కామేపల్లి గ్రామంలో ఈ నెల 7 వ తేదీన పెద్ద అగ్ని ప్రమాదం జరిగింది. నూటయాభై ఇళ్లు కాలిపోయాయి. తిండిగింజలు వగైరా కాలిపోయి సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగింది. సుమారు 80 సంవత్సరాలు గలిగిన ఒక స్త్రీ, ఈ ప్రమాదంలో మరణించింది. రెండు పశువులు కాలిపోయాయి. స్థానిక కమ్యూనిస్టు కార్యకర్తలు అగ్ని బాధితులకు సహాయం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే అగ్నిబాధితులకు తగునహాయ కార్యక్రమాలు అమలు జరపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. (వి.వి.)

బ్రిటిష్ ప్రభుత్వం వద్దనున్న భారతీయ సాంస్కృతిక సంపదనుపొందేందుకు బ్రిటిష్ ప్రభుత్వంతో భారతప్రభుత్వం సంప్రదింపులు జరుపుతున్నదని నేడు రాజ్యసభలో విద్యామంత్రి శ్రీ యం. సి. దాగ్లా చెప్పారు.

గోడౌనును బ్రద్దలుకొట్టి బియ్యాన్ని దొంగిలించిన వ్యాపారస్తుని అరెస్టు

హైదరాబాద్, మార్చి 10

హైదరాబాదు నగరంలో 8 నెలలక్రితం గూఢచారి శాఖ సీలు చేసిన గోడౌనును బ్రద్దలు చేసి 153 బస్తాల బియ్యాన్ని దొంగిలించి, పోలీసులకు తప్పుడు రిపోర్టు చేసినారనేనేరంపై నేడిక్కడ నేరపరిశోధక కేంద్రం వారు ఒక వ్యాపారస్తుణ్ణి, అతని సహచరుణ్ణి అరెస్టుచేశారని పోలీసువర్గాల వలన తెలియవచ్చింది.

నగర మేజిస్ట్రేటు నేరస్తులను పోలీసు కస్టడీ క్రింద రిమాండులో వుంచారు.

నారసింహలేహ్యం

బంగారు వంటిది. మేహము, నిక్కాక, నిస్సత్తువను హరించి బలమును, రక్తవృద్ధిని కల్గించును. 20 తు. డబ్బీ రు. 4-00,

రోజాపుష్ప లేహ్యము

అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం, హరించి, చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు. 1-50. పోస్టేజి రు. 1-30, మా క్యాటలాగు, క్యాలండరు ఉచితం.

పి. సి. ఏ. అండ్ కో., ఆయుర్వేదసమాజం. పెరిడేపి, నెల్లూరు జిల్లా.

నెం. 95 సైజు 7.4" బై 9.4" క్రోమ్ జ్యూయల్డ్ రు. 33/-
నెం. 96 సైజు ,, 15 జ్యూయల్డ్ రు. 52/-
ప్యాకింగ్ అండ్ పోస్టేజి రు. 2/- అదనం.
మరి వివిధ రకాల చేతి గడియారములకు, అలారం గడియారములకొరకు క్యాటలాగు అడగండి :

S. T. CORPORATION
30, Tawa Lane, Bombay.3.

Now Available In
MOSCOW NEWS
The Five Year Plan of USSR (1966 - 1970)
The programme of peace, big economic development and of building Communist Society.
To be presented to the Twentythird Congress of the CPSU
Place Your Orders with:
Visalaandhra Publishing House,
Eluru Road Centre :: Vijayawada-2
Visalaandhra Book House,
Sultan Bazar :: Hyderabad.



సోలే సెల్లింగ్ ఏజంట్సు
నాగి సేల్సు కార్పొరేషను,
177, జగన్నాథ్ శంకర్ సేఠ్‌రోడ్, బొంబాయి-4 (బి.ఆర్.)

కెంప్‌వారి తామర మందు

చర్మ, చీడ వ్యాధులకు

KEMPWOPM OINTMENT
Kempworta
Pharmaceutical Chemists
TRADE MARK
KEMP & CO.